శ్మశాన వాటికలను శుభ్రంగా ఉంచాలి



శ్మశాన వాటికలో పనులు చేయిస్తున్న కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శ్మశాన వాటికలను శుభ్రంగా ఉంచాలని కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌ సూచించారు. షబ్బే–ఏ బరాత్‌ సందర్భంగా శుక్రవారం డివిజన్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌ బీ–బ్లాక్‌, మార్తాండనగర్‌, అంజయ్యనగర్‌, న్యూ పీజేఆర్‌ నగర్‌లోని ఖబ్రస్థాన్‌లను ఆయన సందర్శించి మాట్లాడారు. షబ్బే–ఏ బరాత్‌ సందర్భంగా ముస్లిం సోదరులు శ్మశాన వాటికలను వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ఆయన వెంట షేక్‌ ఇమామ్‌, సయ్యద్‌ ఉస్మాన్‌, షేక్‌ జాఫర్‌, ఇనాయత్‌, అబ్దుల్‌ కరీం, సయ్యద్‌ హర్షద్‌, అబ్దుల్‌ వసీం, సంజు, సంతోష్‌ ఉన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌–21 పరిధిలోని మదీనాగూడ జీఎస్‌ఎం మాల్‌ నుంచి మియాపూర్‌ ఆల్విన్‌ కాలనీ చౌరస్తా వరకు జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తున్నారు. శుక్రవారం మదీనాగూడ, దీప్తిశ్రీనగర్‌, మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లే దారి వరకు జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ నాగిరెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌, లా అండ్‌ ఆర్డర్‌ పోలీసుల ఆధ్వర్యంలో జేసీబీతో తొలగింపజేశారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన



రాయదుర్గం: సైబరాబాద్‌ పోలీసులు, సొసైటీ ఫర్‌ సైబరాబాద్‌ సెక్యూరిటీ సర్వీసెస్‌ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయలో శుక్రవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబరాబాద్‌ అదనపు పోలీసు కమిషనర్‌ సత్యనారాయణ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై అవగాహన, బాధ్యతాయుతంగా డ్రైవింగ్‌, ట్రాఫిక్‌ నిబంధనలు పాటించడంతో ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి నిషాకర్కి, కేశవ్‌బండారి ఆధ్వర్యంలోని బృందం ట్రాఫిక్‌ నియమాలు, పాదచారుల భద్రత, హెల్మెట్లు, సీటు బెల్ట్‌ల ప్రాముఖ్యత, తదితర అంశాలపై వివరించారు.

500 గ్రాముల గంజాయి స్వాధీనం

గచ్చిబౌలి: స్కూటీలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్న ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రణయ్‌ వివరాల ప్రకారం.. శుక్రవారం ఖాజాగూడలో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై వెళ్తున్న రాజేంద్రనగర్‌కు చెందిన గణేష్‌సింగ్‌ నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్కడే ఉన్న కష్టమర్లు మహేష్‌, రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబుల్‌ బెడ్రూం ఇళ్లను మున్సిపల్‌ ప్రత్యేకపాలన అధికారి పాల్గున్‌ కుమార్‌ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

దాతల సహకారంతో మరింత అభివృద్ధి

పటాన్‌చెరుటౌన్‌: దాతల సహకారంతో గణేష్‌ గడ్డ దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆలయ ఈవో లావణ్య తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం దాతల సహకారంతో జరుగుతున్న స్వామి వారి మండపం, ప్రసాదాల కౌంటర్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. మాట్లాడుతూ...గణేష్‌ గడ్డ దేవస్థానంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ఆవరణలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

చెరువంతా గుర్రపు డెక్క..

రాత్రంతా దోమల మోత

చెరవులు, కుంటల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి దోమల మోతతో కంటిమీద కునుకు కరువైందని వివిధ ప్రాంతాల వాసులు వాపోతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో ఎంటమాలజీ విభాగం పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు జోక్యం చేసుకొని దోమల నివారణకు చర్యలు చేపట్టేలా చూడాలని కోరుతున్నా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –శేరిలింగంపల్లి



- విస్తరిస్తున్న గుర్రపు డెక్క
- ఎంటమాలజీ విభాగం పనితీరుపై ఆగ్రహం
- చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

కానరాని ఫాగింగ్‌..

ఎంటమాలజీ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బందిలో కొంత మంది బెంబేలెత్తిపోయి చేయలేమని విధుల నుంచి తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. సర్కిల్‌ ఎంటమాలజీ విభాగంలో అసిస్టెంట్‌ ఎంటమాలజిస్టు ఇప్పటికే తప్పుకోగా, ఇతరులు కూడా అదే మార్గంలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో దోమల నియంత్రణకు నిత్యం యాంటీ లార్వ ఆపరేషన్స్‌ చేసేందుకు డివిజన్‌కు–1 టీమ్‌ (18 స్టాఫ్‌) చొప్పున సిబ్బంది పనిచేస్తారు. వారు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు దోమలమందు పిచికారీ చేస్తారు. ఆయా సిబ్బందిని జీహెచ్‌ఎంసీ బీఎల్‌ఓలుగా,ఇతర కార్యక్రమాలకు కూడా వినియోగించడంతో ఇబ్బంది అవుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. అదే విధంగా 14మంది సిబ్బంది ప్రతి రోజు సాయంత్రం వేళలలో కాలనీల్లో ఫాగింగ్‌ చేస్తారు. ప్రతి రోజు 5 కాలనీల్లో ఫాగింగ్‌ చేయడంతో సర్కిల్‌ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నెలకు ఒక సారి కూడా ఫాగింగ్‌ చేయలేని పరిస్థితి నెలకొంది.

తొలగించినా మళ్లీ విస్తరిస్తోంది

- శేరిలింగంపల్లిలోని చెరువుల్లోని గుర్రపుడెక్కతోనే సమస్య వస్తోందని స్థానికులు వాపోతున్నారు.
- శేరిలింగంపల్లి చాకలివాని కుంటలో గతేడాద అక్టోబర్‌ వరకు ఎఫ్‌టీసీ మిషన్‌ గుర్రపు డెక్కను తొలగించినప్పటికీ మళ్లీ చెరువంతా విస్తరించిపోయింది. అదే విధంగా గోపీచెరువులోనూ గుర్రపు డెక్క విస్తరిస్తోంది.
- శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు అవసమైన చర్యలు వెంటనే చేపట్టాలి. అందుకు అవసమైన ఎఫ్‌టీసీ మిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటల్లో సీవరేజ్‌ వాటర్‌ కల్వకుండా జీహెచ్‌ఎంసీ, సీవరేజ్‌ బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేసి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- ఎంటమాలజీ విభాగం సిబ్బందిని ఇతర పనుల్లో నియమించకుండా దోమల నియంత్రణకే వినియోగిస్తే సమస్యల కొంతమేరైన పరిష్కారం అవుతుందంటున్నారు. ఫాగింగ్‌ మెషిన్‌ల సంఖ్య పెంచాలన కోరుతున్నారు.



గోపీచెరువులో ..

స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టాలి



దోమల నియంత్రణకు స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టాలి. కాలనీలు, బస్తీలలో ప్రతిరోజూ ఫాగింగ్‌ చేయాలి. సిబ్బంది సంఖ్యను పెంచాలి. దోమలతో అనేక వ్యాధులు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– తాడిబోయిన రామస్వామి యాదవ్‌, మాజీ మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌

గుర్రపుడెక్కను శాశ్వతంగా తొలగించాలి



చెరువులు, కుంటల్లో గుర్రపుడెక్కను శాశ్వతంగా తొలగించి మళ్లీ విస్తరించకుండా చర్యలు చేపట్టాలి. గుర్రపుడెక్కతోనే చుట్టూరా ఉండే కాలనీ,బస్తీల ప్రజలు నిత్యం అవస్థల పాలవుతున్నారు. అంతేకాక కొన్ని చోట్ల నాలాల్లోనూ దోమలు పెరిగిపోతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించేలా చూడాలి. కాలనీ, బస్తీల్లో నిత్యం ఫాగింగ్‌ చేయాలి.

– బద్దం కొండల్‌రెడ్డి, పాపిరెడ్డినగర్‌ అధ్యక్షుడు

టీడీఎస్‌ఐ శ్వేతపత్రంలో ట్రిపుల్‌ఐటీ స్మార్ట్‌సిటీ లివింగ్‌ ల్యాబ్‌ కీలకపాత్ర

రాయదుర్గం: స్మార్ట్‌ సిటీ సొల్యూషన్స్‌పై టెలికామ్‌ స్టాండర్డ్స్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా (టీడీఎస్‌ఐ) విడుదల చేసిన శ్వేతపత్రంలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ లోని స్మార్ట్‌ సిటీ లివింగ్‌ ల్యాబ్‌ కీలకపాత్ర పోషించింది. ఈ శ్వేతపత్రంపై శుక్రవారం ట్రిపుల్‌ఐటీ స్మార్ట్‌ సిటీ లివింగ్‌ ల్యాబ్‌ చీఫ్‌ టెక్నాలజీ ఆర్కిటెక్ట్‌ అనురాధ వట్టెం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శ్వేతపత్రం స్మార్ట్‌ సిటీలకు అందించిన సహకారంలో ముఖ్యమైన మైలురాయిగా సూచిస్తుందన్నారు. టీఎస్‌డీఎస్‌ఐ, విద్యావేత్తలు, పరిశ్రమల నుంచి అనేక మంది సహకారంతో ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. ఈ శ్వేతపత్రంలో స్మార్ట్‌సిటీ నిర్దిష్ట పరిష్కారాలు, ప్రస్తుత లివింగ్‌ల్యాబ్‌లు ముందుకు వెళ్లడానికి సవాళ్లు, సూచనలు వంటి అంశాలు కీలకంగా మారాయన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్‌



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్‌ నిర్మాణం స్థానికంగా చర్చగా మారింది. నిత్యం రద్దీగా ఉండే కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్‌ నిర్మాణం ప్రమాదకరంగా మారవచ్చని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలోనే పట్టణానికి అదనపు సబ్‌స్టేషన్‌ మంజూరైంది. నాటి నుండి సబ్‌స్టేషన్‌ నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు అనేక స్థలాలను పరిశీలించారు. చివరకు బెల్‌ యాజమాన్యం వద్దకు సైతం పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు వెళ్లి సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాని కోరినా అధికారులు స్పందించలేదు. నిర్మాణం కోసం కావాల్సిన స్థలం లభించకపోవడంతో అధికారులు ఏకంగా ప్రభుత్వ కార్యాయాల మధ్యలో సబ్‌స్టేషన్‌ నిర్మాణం మొదలుపెట్టారు. తహసీల్దార్‌, ఎంఈఓ, అమీన్‌పూర్‌ మండల పరిషత్‌ కార్యాలయాలు, మహిళా భవనం కూడా ఈ ప్రాంగణంలోనే ఉన్నాయి. దీంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారు. దీంతో తమ వాహనాలు నిలపడానికి కూడా స్థలం ఉండదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో సబ్‌స్టేషన్‌ నిర్మాణానికి ఉన్నతాధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యానగర్‌, సురక్షా ఎన్‌క్లేవ్‌, సురక్షా హిల్స్‌, శుభోదయ కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్‌, అపర్ణ హెచ్‌టీ సర్వీస్‌ ప్రాంతాలు.
- 10.30 నుంచి 11.30 వరకు శాంతినగర్‌, ఉషోదయ అపార్ట్‌మెంట్‌ రోడ్డు, ధర్మపురి టెంపుల్‌ రోడ్డు, దీప్తిశ్రీనగర్‌ రోడ్డు నెంబర్‌ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్‌ ప్రాంతాలు.
- మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 వరకు కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, పీజేఆర్‌ రోడ్డు 2,4,6,8 ప్రాంతాలు.
- మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

చందానగర్‌ పరిధిలో..

- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్తాండనగర్‌, న్యూ హఫీజ్‌పేట్‌, హనీఫ్‌ కాలనీ ప్రాంతాలు.
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హఫీజ్‌పేట్‌, ప్రేమ్‌నగర్‌ పూర్తిగా, ప్రేమ్‌నగర్‌ బీ–బ్లాక్‌ ప్రాంతాలు.
- మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు శిల్పా గార్డెన్‌, సీఎం తోట, ప్రేమ్‌నగర్‌ బీ- బ్లాక్‌.
- ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్‌ కాలనీ, సమత కోఆపరేషన్‌ హౌసింగ్‌ సొసైటీ విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

మియాపూర్‌ సెక్షన్‌ పరిధిలో..

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మదీనాగూడ, కృషినగర్‌, ఎంఏనగర్‌, స్టాలిన్‌నగర్‌, ప్రశాంత్‌ నగర్‌, స్వర్ణపురి కాలనీ, జనప్రియ వెస్ట్‌సిటి, బికె ఎన్‌క్లేవ్‌, వీడియా కాలనీ, మియాపూర్‌ మెయిన్‌ రోడ్డు, ఎఫ్‌సీఐ కాలనీ, లేక్‌ వ్యూ అపార్ట్‌మెంట్స్‌, లోటస్‌ కాలనీ, జేపీనగర్‌, ఎస్‌ఎంఆర్‌ మెట్రోపాలిస్‌, ఎస్‌ఆర్‌ ఎస్టేట్‌ అపార్ట్‌మెంట్స్‌, వడ్డెర బస్తీ, దత్త సాయినగర్‌, అరబిందో కాలనీ, విజేత సూపర్‌ మార్కెట్‌ లేన్‌ నుంచి టాకీటౌన్‌ మెయిన్‌ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయం ఉంటుందని ఏఈ రాజ్‌కుమార్‌ పేర్కొన్నారు.

చందానగర్‌ : మాతృశ్రీనగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మాతృశ్రీనగర్‌, ఓల్డ్‌ సొసైటీ, ఎస్‌బీఐ, మాధవనగర్‌, విజేత సూపర్‌ మార్కెట్‌ ప్రాంతాలు.

కొండాపూర్‌ పరిధిలో..

గచ్చిబౌలి: కొండాపూర్‌ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్‌ కాలనీ, మాధవహిల్స్‌, గోల్డెన్‌తులిప్‌ రోడ్‌ నెంబర్‌–1,2,3,4,5 ప్రాంతాలు, వెంకటరమణ టాటా మోటార్స్‌ లేన్‌, హై టెన్షన్‌ టవర్‌ లైన్స్‌ రోడ్డు, విజేత సూపర్‌ మార్కెట్‌ రోడ్డు, జేవీజీ వ్యాలీ, సెంట్రల్‌పార్కు ఫేజ్‌–2, మాధవహిల్స్‌, గాయత్రి లే అవుట్‌, కాంతి వనం, ప్రభుపాద వంటి ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

కాయిదమ్మకుంట చెరువు రూపురేఖలు మారుస్తాం



సుందరీకరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పునరుద్ధరణతో రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌ సంస్థ వారి సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో చేపట్టనున్న చెరువు సుందరీకరణ పనులను ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులో మురుగు నీరు కల్వకుండా ఇరిగేషన్‌ అధికారులు గతంలో యూజీడీ పైప్‌లైన్‌ చేపట్టారని ఈ పనులను అర్ధంతరంగా వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఔట్‌లెట్‌ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. మురుకి కుంపటిగా ఉన్న చెరువును స్వచ్ఛమైన నీరు ఉండేలా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నళిని, ఏఈ పావని, రెవెన్యూ అధికారులు సర్వేయర్‌ జగదీశ్వర్‌, మాజీ కార్పొరేటర్‌ అశోక్‌ గౌడ్‌, గౌతమ్‌ గౌడ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, దాత్రినాథ్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

భూమి, ఇళ్ల కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న అశోక్‌ ఓంకార్‌

చందానగర్‌ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లైనా భూమి, ఇల్లు, స్థలం కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం సిగ్గు చేటని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ ఓంకార్‌ పేర్కొన్నారు. కామ్రేడ్‌ తాండ్ర కుమార్‌ 3వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మియాపూర్‌ చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేదవారి భూములు, ఇళ్ల స్థలాలు కార్పొరేట్‌ సంపన్న వర్గాలకు ఫార్మా కంపెనీల పేరుతో రింగ్‌ రోడ్డు నిర్మాణం పేరుతో లక్షలాది ఎకరాల భూమిని దారాదత్తం చేస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా కామ్రేడ్‌ తాండ్రకుమార్‌ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలన్నారు. ఈ సభలో రవి, చలపతిరావు, నర్సింహరావు, ప్రసాదన్న, మురహరి, నల్ల సూర్యప్రకాష్‌, వనం సుధాకర్‌, గోనె కుమారస్వామి, వసుకుల మట్టయ్య, హంసా రెడ్డి, పెద్దార రమేష్‌ పాల్గొన్నారు. .

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోపన్‌పల్లితండాలో నివాసముండే శంకర్‌లక్ష్మీ(67) శుక్రవారం తెల్లవారుజామున గోపన్‌పల్లితండా ఫ్లై ఓవర్‌ జంక్షన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా నల్లగండ్లవైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. గచ్చిబౌలిలోని హిమగిరి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

చదువుతో పాటు నైపుణ్యం అవసరం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో 2025ను స్కూల్‌ ఆఫ్‌ సైన్సెస్‌గా ప్రకటిస్తున్నట్లు వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వ విద్యాలయంలోని స్కూల్‌ ఆఫ్‌ సైన్సెస్‌లోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'మ్యాలిక్యులర్‌ బయాలజీ అండ్‌ బయో ఇన్ఫర్మేటిక్స్‌లో సాధనాలు, సాంకేతికతలు' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు నైపుణ్యాలు కలిగి ఉంటేనే ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించగలమని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ జీవ శాస్త్ర విభాగం ప్రొఫెసర్‌ కోట అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచంలో ప్రతిశాస్త్రంలో చదువుతోపాటు నైపుణ్యాలు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వాటికి అనుగుణంగా మన పనితీరు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్‌ ఆఫ్‌ సైన్సెస్‌ డీన్‌ ప్రొఫెసర్‌ హెచ్‌ అలీమ్‌ బాషా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్‌ ఆరిఫ్‌అహ్మద్‌, ప్రొఫెసర్‌ పీఎఫ్‌రహమాన్‌, డాక్టర్‌ మహ్మద్‌కమ్రాన్‌ డాక్టర్‌ సుఫాయాజమీల్‌, డాక్టర్‌అలీరజా పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అతిథులు

సాహసం చేసిన పోలీసులకు రివార్డులు

రాయదుర్గం: గచ్చిబౌలి కాల్పుల్లో సాహసం చేసిన పోలీసు సిబ్బందిని సైబరాబాద్‌ సీపీ అవినాష్‌మహంతి అభినందించారు. ఇటీవల గచ్చిబౌలిలోని పబ్‌లో కాల్పుల ఘటనలో పోలీసులు ప్రాణాలకు తెగించి కరుడుగట్టిన నేరస్తున్ని పట్టుకున్నారు. ఈ ఘటనలో సాహసోపేత ప్రయత్నం చేసిన మాదాపూర్‌ సీసీఎస్‌లో పనిచేసే పోలీసులు వెంకట్‌రెడ్డి, కె ప్రదీప్‌రెడ్డి, పి వీరస్వామి సైబరాబాద్‌ కమిషనరేట్‌ సీపీ అవినాష్‌ మహంతిని కలిశారు. ఈ సందర్భంగా సీపీ ముగ్గురికి రివార్డులను అందించారు. ఫిబ్రవరి 1న కరుడుగట్టిన బత్తుల ప్రభాకర్‌ను పట్టుకునే ఆపరేషన్‌ సమయంలో గచ్చిబౌలిలోని ఓ పబ్‌లో ప్రభాకర్‌ పోలీసు బృందంపై కాల్పులు జరిపారు. హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకట్‌రెడ్డి గాయం కావడంతో వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇంత జరిగినా 70కి పైగా క్రిమినల్‌ కేసులున్న బత్తుల ప్రభాకర్‌ను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ సంజీవ్‌కుమార్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ప్రజాసేవలో పోలీసులు అంకితభావంతో తమ విధులు నిర్వర్తించాలని సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ కమిషనరేట్‌లో అసాధారణ సేవ, అంకితభావంతో పనిచేసిన 107 పోలీసులకు మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పనితీరును మరింత మెరుగుపర్చుకొని భవిష్యత్తులో మరిన్ని గౌరవాలు, మెడల్స్‌ సాధించాలన్నారు. అసాధారణ నైపుణ్యాలు, నిబద్ధతను ప్రదర్శించే పోలీసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గుర్తించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్‌, ఎస్‌బీ డీసీపీ సాయిశ్రీ, సైబర్‌క్రైమ్‌ డీసీపీ శ్రీబాల, కార్‌ హెడ్‌క్వార్టర్స్‌ డీసీపీ సంజయ్‌, ఏడీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు పాల్గొన్నారు.



సీపీ అవినాష్‌మహంతితో రివార్డులు అందుకున్న పోలీసులు

రాజగోపాల్‌ నగర్‌ భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్‌ మండలం , ఐలాపూర్‌ పరిధిలోని రాజగోపాల్‌ నగర్‌ భూములను కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి, హైడ్రా కమిషనర్‌ రంగానాథ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐలాపూర్‌, రాజగోపాల్‌ నగర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సందీప్‌ కుమార్‌ మాట్లాడారు. ఐలాపూర్‌లోని సర్వేనెంబర్‌ 119 నుంచి 220 వరకు 408 ఎకరాల స్థలంలో 1984, 85 ప్రాంతంలో రాజగోపాల్‌ నగర్‌లో తాము 200, 300, 500 గజాల చొప్పున సుమారు 4 వేల మందిమి కొనుగోలు చేశామని అన్ని పత్రాలు సజావుగానే ఉన్నాయని, 1930 నుంచి డాక్యుమెంట్లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉండడంతో రిజిస్ట్రేషన్‌ చేసుకున్నామన్నారు. ఓ అధికారి తమ స్థలాన్ని ప్రభుత్వ స్థలమంటూ నివేదిక ఇవ్వడంతో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. ఇప్పటికే కింది కోర్టుల్లో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని హైకోర్టులో కేసు చివరి దశలో ఉందన్నారు. 2020 వరకు తమ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు జరగలేవని, 2021 నుంచి ముఖీం అనే ఓ న్యాయవాది ఈ స్థలం తమదే అంటూ నకిలీ పత్రాలు చూపుతూ ఆక్రమణలు ప్రారంభించాడని తెలిపారు. గతంలోనే ఇక్కడ స్థలాలు కొని ఇంటినిర్మాణం చేసిన కొంత మందిపై తాము న్యాయస్థానంలో కేసు వెయ్యడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు 300 ఇళ్లు కూల్చేశారన్నారు. ఇప్పుడు తిరిగి నోటరీ ద్వారా అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ప్లాట్లు కట్టబెడుతున్నాడని తాము ప్రశ్నించేందుకు వెళ్తే తమపైనే దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



తమ స్థలమంటూ పత్రాలు చూపుతున్న బాధితులు